సాక్షి
పార్వతీపురం మన్యం

మంగళవారం । 13 । మే । 2025



ముగిసిన ఆహ్వాన నాటిక పోటీలు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీల్లో 'చీకటి పువ్వు' ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది.

- 8లో



రెండు చూడి పశువుల దహనం

వేపాడలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో పశువులపాకతో పాటు రెండు చూడి ఆవులు సజీవ దహనమయ్యాయి.

- 8లో

నేడు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మాక్‌డ్రిల్

విజయనగరం అర్బన్: అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. మంగళవారం మధ్యాహ్నం 4 గంటలకు డ్రిల్ ప్రారంభమవుతుందని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ తెలిపారు. విపత్తుల యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖలు పాల్గొంటాయని ఆయన పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

వెంకటరాజపురంలో ఏనుగులు



వెంకటరాజపురం రహదారి వద్ద ఉన్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి, బాసంగి గదబవలస, వెంకటరాజపురం పంట పొలాల్లో సోమవారం సాయంత్రం ఏనుగులు దర్శనమిచ్చాయి. వరి, అరటి పంటలను ధ్వంసం చేస్తుండడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఏనుగుల తరలింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పిడుగు పాటుకు 11 గొర్రెలు మృతి



పిడుగుపాటుకు మృతి చెందిన గొర్రెల వద్ద దిగాలుగా కూర్చున్న పాల్లె నీలయ్య

సీతానగరం: మండలంలోని సుభద్రదరి సీతారాంపురంలో సోమవారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. పిడుగు పాటుకు సీతారాంపురం గ్రామానికి చెందిన పాల్లె నీలయ్యకు చెందిన 11 గొర్రెలు మృతిచెందాయి. కాసేపట్లో ఇంటికి చేరుకునే సమయంలో పిడుగు రూపంలో నష్టం సమకూరిందంటూ పెంపకందారు లబోదిబోమంటున్నాడు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

ముగిసిన వార్షిక కల్యాణ మహోత్సవం



తోటపల్లి కోదండరామాలయంలో స్వామివారి ఉత్సవమూర్తులు

గరుగుబిల్లి: తోటపల్లి కోదండరామస్వామి ఆలయంలో ఈ నెల 8 నుంచి జరిగిన సీతారామస్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవం సోమవారంతో ముగిసింది. ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, పుణ్యాహ వచనం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దాతల సాయంతో కల్యాణోత్సవం నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు.

జీతం విడుదల చేయండి



ధర్నా చేస్తున్న సీహెచ్‌ఓలు

విజయనగరం ఫోర్ట్: సీహెచ్‌ఓ (కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల)లకు వెంటనే ఏప్రిల్ నెల జీతం విడుదల చేయాలని జీహెచ్‌ఓలు మౌనిక, కనకదుర్గ కోరారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీహెచ్‌ఓల సర్వీసును క్రమబద్ధీకరించాలని, ప్రతీనెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 30 శాతం జీతం పెంచాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓలు శ్రీను, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పాలకుల వైఖరిలో మార్పుతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి

బొబ్బిలి: పాలకుల వైఖరిలో పూర్తిస్థాయి మార్పు వస్తేనే ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యమని ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు రౌతు రామమూర్తినాయుడు అన్నారు. బొబ్బిలిలోని ఎన్‌జీఓ హోంలో ఉత్తరాంధ్ర సాధన సమితి ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సాధన సమితి వ్యవస్థాపక కన్వీనర్ వేమిరెడ్డి లక్ష్మునాయుడు అధ్యక్షతన జరిగిన సదస్సులో రామమూర్తినాయుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ఉన్న అపారమైన ప్రకృతి వనరులను సద్వినియోగం చేసుకుంటేనే అభివృద్ధి చెందుతాం తప్ప రాజకీయల వల్ల కాదన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణ, వ్యవసాయాధారిత పరిశ్రమల స్థాపన వంటి చర్యలపై దృష్టిసారించాల్సిన అవసరం ఉందన్నారు. ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు మెరిగాని గోపాలం మాట్లాడుతూ స్థానిక గ్రోత్ సెంటర్‌లో స్థానికులకు ఉద్యోగాలు లేవన్నారు. కార్యక్రమంలో వెంకటనాయుడు, అప్పలరాజు, డి. సత్యంనాయుడు, రెడ్డి దామోదరరావు, చింతల శ్రీనివాసరావు, బొత్స గణేష్ పాల్గొన్నారు.

పింఛన్ కోసం.. అగచాట్లు



ఈ చిత్రంలో కనిపిస్తున్న దివ్యాంగురాలి పేరు గంగమ్మ. మక్కువ మండలం డి.శిర్లాం గ్రామం. వయస్సు 65 సంవత్సరాలు. అనారోగ్యం కారణంగా నడవలేని పరిస్థితి. గతంలో అందే పింఛన్ కొన్నినెలలుగా ఆగిపోయింది. జీవనానికి ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. కుటుంబ సభ్యుల తోడుతో కలెక్టరేట్‌కు వచ్చింది. పింఛన్ మంజూరు చేసి జీవన భరోసా కల్పించాలంటూ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌ను వేడుకుంది.

- 10 నెలలుగా మంజూరుకాని కొత్త పింఛన్లు
- పింఛన్లకోసం దివ్యాంగుల అవస్థలు
- కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్‌కు విన్నపాలు



చిత్రంలో తల్లి సత్యవేణితో కలిసి కలెక్టరేట్‌కు వస్తున్న మానసిక దివ్యాంగురాలి పేరు భోగి యశశ్వి. పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామం. చిన్నారికి వంద శాతం దివ్యాంగత్వం ఉన్నట్టు వైద్యులు సదరం ధ్రువీకరణ పత్రం అందజేశారు. అయినప్పటికీ మానసిక దివ్యాంగురాలికి పింఛన్ మంజూరు కాలేదు. పది నెలలుగా తిరుగుతున్నా ఫలితం లేకపోతోందని తల్లి సత్యవేణి వాపోయింది. తన కుమార్తెతో కలిసి కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

పార్వతీపురంటౌన్:

కూటమి ప్రభుత్వం వచ్చి 11 నెలలవుతోంది. గతేడాది నవంబర్ నెల తర్వాత పింఛన్లు పొందుతూ భర్తలు కోల్పోయిన వితంతువులకు మినహా.. **కొత్త పింఛన్ ఒక్కటీ మంజూరుకాని పరిస్థితి. వివిధ కారణాలతో పింఛన్ రద్దయినవారు, కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు ప్రయత్నించేవారికి పింఛన్ ఎండమావిగానే కనిపిస్తోంది. పింఛన్ కోసం దివ్యాంగుల కష్టాలకు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ వద్ద సోమవారం కనిపించిన ఈ చిత్రాలే సజీవసాక్ష్యం. పింఛన్ కోసం అగచాట్లు పడుతూ పలువురు దివ్యాంగులు కలెక్టరేట్‌కు చేరుకున్నారు.**

కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు తమ గోడు వినిపించారు. పింఛన్ కోసం దరఖాస్తు చేసేందుకు వెబ్‌సైట్ ఓపెన్ కావడంలేదంటూ సమస్యను తెలియజేశారు. పింఛన్ మంజూరుచేసి ఆదుకోవాలని వేడుకున్నారు.



కుటుంబ సభ్యులు ఎత్తుకుని తీసుకువస్తున్న ఈ దివ్యాంగుని పేరు గంగునాయన శ్రీనివాస్. మక్కువ మండలం డి. శిర్లాం గ్రామం. గతేడాదిగా మానసిక వ్యాధికి గురయ్యాడు. కాలు, చేతులు పనిచేయవు. తన దీనస్థితిని గుర్తించి పింఛన్ మంజూరు చేయాలంటూ కలెక్టర్‌కు సోమవారం విన్నవించారు.



'నడవలేని స్థితిలో ఉన్న ఈ వృద్ధురాలి పేరు లింగాల సింహాచలమమ్మ. వీరఘట్టం మండలం దశమాంతపురం. ఆమె నడవలేదు. కూర్చోలేదు. ప్రస్తుతం రూ.6వేల పింఛన్ మాత్రమే వస్తుందని, తనకు రూ.15వేలు పింఛన్ అందజేయాలంటూ తన కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు విన్నవించుకుంది.'

వీరుడికి వందనం

సాలూరు: దేశ రక్షణలో వీర మరణం పొందిన సత్యసాయి జిల్లాకు చెందిన జవాన్ మురళీనాయక్ త్యాగాన్ని దేశం మరిచిపోదని వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. మురళీనాయక్ చిత్రపటానికి సోమవారం నివాళులర్పించారు. వీరుడా వందనం అంటూ సెల్యూట్ చేశారు. ఆయన త్యాగం ఎందరికో ఆదర్శప్రాయమన్నారు.

భారతదేశంలో ఇటువంటి వీర సైనికులు కోకొల్లలుగా ఉండడం గర్వకారణంగా ఉందన్నారు. మురళీనాయక్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

- మురళీనాయక్‌కు నివాళులర్పించిన మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



తలసరి ఆదాయం పెంపునకు చర్యలు

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనిత
- సంకిలి చక్కెర కర్మాగారంపై స్పష్టత ఇవ్వండి: జెడ్పీచైర్మన్



డీఆర్సీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనిత

విజయనగరం క్రైమ్: విజన్–2047లో భాగంగా జిల్లా ప్రజల తలసరి ఆదాయం పెంపునకు చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా ఇన్‌చార్జి మంత్రి, హోమ్‌శాఖమంత్రి వంగలపూడి అనిత కోరారు. దీనికోసం అందుబాటులో ఉన్న సహజవనరులను వినియోగించుకోవాలన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన డీఆర్సీ సమావేశంలో ఆమె మాట్లాడారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. విజయనగరం ఎమ్మెల్యే అదితి సూచనల మేరకు భూగర్భజలాల పెంపునకు చర్యలు తీసుకోవాలన్నారు. తమ నియోజకవర్గాల్లో రోడ్ల మరమ్మతు పనులు పూర్తికాలేదంటూ రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన మంత్రి దృష్టికి తెచ్చారు. బోర్ల మరమ్మతుల పనులు వేగంగా జరగడంలేదని ఎమ్మెల్సీ సురేష్‌బాబు తెలియజేశారు. కొత్తవలసలో చెరువులో అక్రమ రోడ్డు నిర్మాణం, రేగ, పుణ్యగిరి, ధారపర్తి తదితర గిరిజన ప్రాంతాలకు రోడ్డు నిర్మాణం ఆగిపోయిన విషయాన్ని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సమావేశంలో ప్రస్తావించారు. ఉపాధి హామీ ఏపీఓ శ్రీనివాసరావుపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, అతనిని సరెండ్ చేయాలని మంత్రి ఆదేశించారు.

సంకిలి చక్కెర కర్మాగారాన్ని మూసివేస్తారన్న ప్రచారం జరుగుతోందని, దీనిపై వివరణ ఇచ్చి రైతులకు భరోసా కల్పించాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. విజయనగరంలో మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌ను, డిగ్రీ కళాశాల నిర్మాణాన్ని ప్రారంభించాలని ఎమ్మెల్యే అదితి కోరారు. సివిల్ సప్లయ్ డీఎంగా పనిచేసి ఇటీవలే బదిలీపై వెళ్లిన మీనాకుమారిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్టు మంత్రి ప్రకటించారు. సమావేశంలో కలెక్టర్ అంబేడ్కర్, మంత్రి కలిశెట్టి అప్పలనాయుడు, ఎస్పీ వకుల్ జిందల్, జేసీ సేతుమాధవన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, సీపీఓ బాలాజీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విస్తృత తనిఖీలు



తోటపల్లి ప్రాజెక్టు వద్ద తనిఖీలు చేస్తున్న పోలీస్ సిబ్బంది

గరుగుబిల్లి: దేశ సరిహద్దుల్లో నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ ఎస్.వి. మాధవ్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ఎస్‌ఐ పి.రమేష్ నాయుడు ఆధ్వర్యంలో తోటపల్లి ప్రాజెక్టు వద్ద బాంబు డిస్పోజల్ టీం, డాగ్ స్క్వాడ్ సంయుక్తగా సోమవారం తనిఖీలు చేపట్టాయి. భద్రతా కారణాల దృష్ట్యా భారీ ప్రాజెక్టుల వద్ద ప్రత్యేక నిఘా పెట్టామని ఎస్‌ఐ తెలిపారు.

చదురుగుడికి.. సిరుల తల్లి



ఉత్సవ విగ్రహానికి జలాభిషేకం చేస్తున్న ఆలయ సిబ్బంది, అర్చకులు

- శోభాయమానం.. పైడితల్లి దేవర మహోత్సవం
- ఉత్సవ రథంపై ఊరేగిన అమ్మవారు
- హుకుంపేటలో ఘటాలకు పసుపు, కుంకుమలతో అభిషేకాలు
- అడుగడుగునా అమ్మకు పూజలు చేసిన భక్తజనం
- చదురుగుడికి చేరిన సిరులతల్లి

విజయనగరం టౌన్:

మంగళవాయిద్యాలు.. భక్తుల జయజయ ధ్వానాలు.. సాంస్కృతిక ప్రదర్శనల నడుమ పైడితల్లి దేవరమహోత్సవం సోమవారం శోభాయమానంగా సాగింది. రైల్వేస్టేషన్ వద్ద ఉన్న వనంగుడి నుంచి సిరులతల్లి చదురుగుడికి చేరుకున్నారు. ముందుగా వనంగుడి స్తపన మందిరంలో సాయంత్రం 4.30 గంటలకు అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ఆలయ వేదపండితులు, భక్తులు, పూజారులు శాస్త్రోక్తంగా పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరణ చేశారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు అమ్మవారి ఉత్సవ విగ్రహంతో ఆలయం చుట్టూ జై పైడిమాంబనామ స్మరణతో మూడుసార్లు ప్రదక్షిణ చేశారు. అనంతరం అప్పటికే ఆలయం బయట సిద్ధంగా ఉంచిన ఉత్సవ రథంపై అమ్మవారిని ఆశీనులు చేసి హారతిచ్చారు. మంగళ వాయిద్యాలు, విచిత్ర వేషధారణలు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ అమ్మ రథం ముందుకు కదిలింది.

దారిపొడవునా పూజలు

సిరులతల్లి వనంగుడి నుంచి చదురుగుడికి బయలుదేరిన వేళ... విద్యల నగరంలో ఆద్యంతం భక్తిభావం ఉప్పొంగింది. రైల్వేస్టేషన్ వద్ద నుంచి ప్రారంభమైన రథం.. గాడీఖానా, సీఎంఆర్ కూడలి, వైఎస్సార్ సర్కిల్, ఎన్‌సీఎస్, కన్యకాపరమేశ్వరి ఆలయం, గంటస్తంభం, మున్సిపల్ ఆఫీస్, కమ్మవీధి, తెలకలవీధి రామమందిరం మీదుగా హుకుంపేటకు చేరుకుంది. అక్కడ చదురు వద్ద ఉత్సవ విగ్రహాన్ని, పూజారి ఇంటివద్ద ఇత్తడి ఘటాలను పెట్టారు. రాత్రి 7 నుంచి 10 గంటల వరకూ భక్తులు దర్శించుకున్నారు. తాడేపల్లి గూడెం కళాకారులు ప్రదర్శించిన నవదుర్గలు, కాళికామాత వేషధారణలు భక్తిభావాన్ని పెంపొందించాయి. తప్పెటగుళ్లు, కోలాటం, భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ ఇన్‌చార్జి ఈఓ ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సంప్రదాయబద్ధంగా..

సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు ఇంటి వద్ద రాత్రి 7 గంటల సమయంలో అమ్మవారి ఘటాలకు హుకుంపేట ప్రజలు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. మొక్కుబడులు చెల్లించారు. ఈ ఏడాది సిరిమానోత్సవ పండగను అంగరంగ వైభవంగా నిర్వహించుకునేలా చూడాలని, ఎటువంటి అవాంతరాలు లేకుండా కాపాడాలంటూ పైడితల్లిని ప్రార్థించారు. హుకుంపేట నుంచి రాత్రి 10 గంటలకు ఘటాలతో ఊరేగింపు ప్రారంభమైంది. మండపం వీధి, శివాలయం మీదుగా సుమారు 2 గంటల ప్రాంతంలో ఊరేగింపు మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడికి చేరుకుంది. అక్కడ ఆలయంలో ఘటాలు, అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయంలో ఉంచారు. వేకువజామున 3 గంటల ప్రాంతంలో ఆలయ తలయారీ రామవరపు చినపైడిరాజు బృందం సాయంతో జంగిడి మీద దీపం పెట్టుకుని, చదురుగుడి నుంచి డప్పు వాయిద్యాలతో మంగళవీధి మీదుగా తలయారి, పూజారి, కొందరు భక్తులు చెరువు వద్దకు వెళ్లి అమ్మవారికి మనవి చెప్పారు. అక్కడి మట్టిని అమ్మవారి బొమ్మగా మలచి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. ఈ రోజు నుంచి అమ్మవారు చదురుగుడిలో దర్శనమిస్తారని సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు తెలిపారు.

ప్రతి వారం పురోగతి కనిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురంటౌన్: కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన ఉపాధి హామీ పథకం నిధులతో జిల్లాలో చేపట్టే క్యాస్కేడింగ్, చెక్ డ్యామ్‌లు, కోకోనట్ ప్లాంటేషన్ పనుల్లో ప్రతివారం పురోగతి కనిపించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నీటి పారుదలశాఖ ఈఈలు, డీఈఈలు, ఏఈఈలతో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరువులు, చెక్‌డ్యామ్‌ల పనులను పంచాయతీ సర్పంచ్‌ల తీర్మానంతో వెంటనే ప్రారంభించాలన్నారు. ఏఈఈల వారీగా లక్ష్యాలు నిర్దేశించాలన్నారు. ఇకపై ప్రతి సోమవారం వీటిపై సమీక్షిస్తామన్నారు. ఇచ్చిన లక్ష్యాలు నాలుగు వారాల్లో పూర్తిచేసిన అధికారులకు ప్రత్యేక ప్రోత్సాహక బహుమతిని అందజేస్తామని తెలిపారు. ఎకరాకు 60 కొబ్బరి మొక్కల చొప్పున 5వేల ఎకరాల్లో కొబ్బరి తోటల పెంపకానికి ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. కార్యక్రమంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ ఆర్.అప్పల నాయుడు, ఇతర ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామంగా 'మనుమకొండ'

పార్వతీపురంటౌన్: భామిని మండలం మనుమకొండ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో సోమవారం వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వివిధ రంగాల్లో యంత్రాల వినియోగం పెంపుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి రంగంలో కనీసం 15 శాతం సుస్థిర అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, మత్స్య శాఖలకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు, వంట గ్యాస్, గృహం, ఎన్టీఆర్ వైద్యసేవ కార్డు, తాగు నీరు, విద్యుత్, మరుగుదొడ్లు ఉండాలని, వాటి వినియోగం పట్ల స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామంలో ఫోన్ సేవలు, బ్రాడ్‌బ్యాండ్ సేవలు, విద్యా సంస్థ, వైద్య సేవలు అందుబాటులో ఉండాలని ఆయన పేర్కొన్నారు. పసుపు, చింతపండు, అడ్డాకులు తదితర ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్తుల్లో ఆర్థిక అక్షరాస్యత పెంచాలన్నారు. కార్యక్రమంలో సీతంపేట ఐటీడీఏ పీఓ, పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీరరాజు, బ్లాక్ కోఆర్డినేటర్ మహేశ్వరరావు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్ రేపు

- డీఎస్సీ అభ్యర్థులకు వయోపరిమితి 47 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్



డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కోట కూడలి వద్ద డీఎస్సీ అభ్యర్థుల మానవహారం

విజయనగరం గంటస్తంభం: డీఎస్సీ అభ్యర్థులకు పరీక్ష సమయం 90 రోజులు గడువు ఇవ్వాలని, వయోపరిమితి 47 సంవత్సరాలకు పెంచాలని కోరుతూ ఈ నెల 14న తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని భారత ప్రజాతంత్ర యువ జన సమైఖ్య (డీవైఎఫ్‌ఐ) సభ్యులు పిలుపునిచ్చారు. కోట కూడలిలో సోమవారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ సీహెచ్.హరీష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిరుద్యోగులు పోరాడి డీఎస్సీ నోటిఫికేషన్ సాధించుకున్నారన్నారు.

ఓపెన్ డిగ్రీలో పాస్ అయిన వారికి, రెగ్యులర్ డిగ్రీ పాస్ అయిన వారికి సమాన అవకాశం కల్పించాలని కోరారు. జిల్లాకు ఒకే పేపర్‌తో పరీక్ష నిర్వహించాలన్నారు. 14న కోట కూడలి నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించే ర్యాలీలో డీఎస్సీ అభ్యర్థులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో భాను, ఈశ్వరరావు, శ్రీను, కిషోర్, రవి తదితరులు పాల్గొన్నారు.

● ఆస్పత్రులకు రోగుల తాకిడి



ప్రస్తుత వాతావరణం విభిన్నంగా ఉంది. ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పల్లెల్లో దాహం కేకలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల కలుషిత నీటిని తాగుతూ అస్వస్థతకు గురవుతున్నారు. మరికొన్నిచోట్ల పారిశుద్ధ్య నిర్వహణ లోపించి దోమకాట్లతో జ్వరాల బారిన పడుతున్నారు. వైద్యం కోసం ఆస్పత్రులకు వెళ్తున్నారు. సీతంపేట ఏరియా ఆస్పత్రిలో సోమవారం 306 ఓపీ నమోదైంది. రక్త పరీక్షలు చేసి వైద్యులు సేవలందించారు. అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నట్టు సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు.

- సీతంపేట

క్లుప్తంగా

పీజీఆర్ఎస్‌కు 136 అర్జీలు

విజయనగరం క్రైమ్: జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మొత్తం 136 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా అర్జీదారులు పూర్తిగా సంతృప్తి చెందే విధంగా వినతులను పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అర్జీలను కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్, డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, కేఆర్‌సీ ఎస్డీసీ మురళి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, నూకరాజు పరిశీలించారు. ఆయా సమస్యలను వీలైనంత వేగంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సమస్యలకు చట్టపరిధిలో పరిష్కారం

విజయనగరం క్రైమ్: జిల్లాపోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల వేదికకు వచ్చిన ఫిర్యాదులను చట్టపరిధిలో పరిష్కరించాలని ఎస్పీ వకుల్‌జిందాల్ సిబ్బందిని ఆదేశించారు. డీపీవోలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని ఏడు రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పీజీడీఆర్ఎస్ లో మొత్తం 46 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సౌమ్యలత, ఎస్‌బీ సీఐలు లీలారావు, చౌదరి, డీసీఆర్‌బీ సీఐ సుధాకర్, ఎస్సై రాజేష్‌లు పాల్గొన్నారు.

కూలికి వెళ్లి.. విగతజీవుడై..

- విద్యుత్ షాక్‌కు గురై యువకుడి మృతి



చిరంజీవి(ఫైల్)

తెర్లాం: కుటుంబ పోషణ నిమిత్తం కూలి పనికోసం వెళ్లిన ఓ యువకుడు విగతజీవుడయ్యాడు. పెళ్లిలో టెంట్లు, లైటింగ్ పనులు చేసేందుకు వెళ్లిన యువకుడికి విద్యుత్ షాక్ తగలడంతో మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి సోమవారం తెర్లాం ఎస్సై సాగర్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సింగిరెడ్డివలస పంచాయతీ పరిధి ఆమిటి సీతారాంపురం గ్రామానికి చెందిన కొత్తకోట చిరంజీవి(20) ఆదివారం కొల్లివలసలో జరిగిన ఓ వివాహానికి టెంట్లు, లైటింగ్ పనులు చేసేందుకు కూలికోసం వెళ్లాడు. పెళ్లి అయిన తరువాత టెంట్లు విప్పుతుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. చిరంజీవికి తండ్రి, ఇద్దరు అక్కచెల్లెళ్లు ఉన్నారు. వారిని పోషించేందుకు పెళ్లిళ్లు, ఇతర శుభ కార్యాల్లో టెంట్లు, లైటింగ్ పనులు చేసేందుకు కూలికి వెళ్తుంటాడు. విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతిచెందిన సమాచారం తెలియడంతో తెర్లాం ఎస్సై సాగర్‌బాబు సిబ్బందితో వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి



లక్ష్మణరావు (ఫైల్)

పాచిపెంట: మండలంలోని పద్మాపురం పంచాయతీ బడ్నాయక వలస గ్రామానికి చెందిన అంగర బోయిన లక్ష్మణరావు (31) బైక్ అదుపుతప్పి మృతి చెందాడు. ఈ ఘటనపై ఎస్సై వెంకట సురేష్ సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లక్ష్మణరావు మద్యానికి బానిసై తరచూ భార్య ఉషారాణితో తగాదా పడుతూ ఉండేవాడు. రోజులాగానే ఆదివారం మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో తగాదాపడ్డాడు. దీంతో తీవ్ర అసహనానికి గురైన భార్య ఇంట్లో ఉన్న ఏవో మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే ఆమెను స్థానికులు సాలూరు సీహెచ్‌సీకి తరలించారు. సాలూరులో చికిత్స పొందుతున్న భార్యను చూడడానికి లక్ష్మణరావు, ఆదివారం రాత్రి సుమారు తొమ్మిది గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై సాలూరు వెళ్తుండగా పి.కోనవలస సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో లక్ష్మణరావుకు తీవ్ర గాయాలు కాగా 108 సహాయంతో విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ముగ్గురు చిన్న పిల్లలు ఉన్నారు.

బైక్ ఢీ కొని వ్యక్తికి గాయాలు

కొమరాడ: మండలంలోని కంబవలస సచివాలయంలో డిజిటల్ సహాయకుడిగా పనిచేస్తున్న పి.శంకరరావు బైక్ ఢీకొని గాయాల పాలయ్యారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో లక్ష్మీపేట గ్రామానికి డిజిటల్ అసిస్టెంట్ శంకరరావు వెళ్తుండగా జంఝావతి డ్యాం దాటిన వెంటనే గుర్తు తెలియని వ్యక్తి సారా కేన్లు బైక్‌తో తీసుకు వెళ్తూ మద్యం మత్తులో డిజిటల్ సహాయకుడు శంకరరావును ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఆయన హెల్మెట్ పెట్టుకున్నందున ముఖం, చేతికి చిన్నపాటి గాయాలయ్యాయి.

యువకుడి ఆత్మహత్య

సాలూరు: పట్టణంలోని డబ్బివీధికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు పట్టణ సీఐ అప్పలనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లారీ క్లీనర్‌గా పనిచేస్తున్న గంట దినేష్(29) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో సోమవారం మద్యానికి డబ్బులు ఇవ్వమని తల్లిని అడగగా, ఇంట్లో డబ్బులు లేవని తెలిపింది. దీంతో మనస్తాపానికి గురైన దినేష్ ఇంటిలో సీలింగ్‌ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. మృతుడి తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు.

చిత్తశుద్ధితో అర్జీలు పరిష్కరించండి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్
- పీజీఆర్ఎస్‌కు అందిన 92 వినతులు

పార్వతీపురంటౌన్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో 92 మంది అర్జీదారుల నుంచి వినతులను కలెక్టర్ స్వీకరించగా, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ,జిల్లా రెవెన్యూ అధికారి కె. హేమలత, ఎస్డీసీ పి.ధర్మచంద్రారెడ్డి, డీఆర్డీఏ పీడీ ఎం.సుధారాణి భాగస్వామ్యమై వినతులను అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, కావున అర్జీలను చిత్త శుద్ధితో త్వరితగతిన పరిష్కారం చేఆయలని అధికారులను ఆదేశించారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి



ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

అర్జీలు కొన్ని ఇలా..

- పాలకొండ నగర పంచాయతీలో పొరుగు సేవల కింద శానిటేషన్ వర్కర్‌గా పనిచేస్తూ ఏసీబీకి పట్టుబడగా హైకోర్టులో కేసు ఉంది. దానిపై తుది తీర్పు రాకముందే ఆ పోస్టును భర్తీ చేస్తున్నారని, కావున తీర్పు వచ్చేంతవరకు దాన్ని నిలుపుదల చేయాలని పాలకొండకు చెందిన కొనపల వీరభద్రపురం వినతి పత్రాన్ని అందజేశాడు.
- గుమ్మలక్ష్మీపురం మండలం పాముల గీసాడ జంక్షన్ నుంచి చిన్న రావికోన గ్రామం వరకు తారు రోడ్డు వేయాలని చిన్న రావికోన గ్రామానికి చెందిన తోయక జమ్మన్న విజ్ఞప్తి చేశాడు.
- బలిజిపేట మండలం పెద్దింపేట నుంచి ముదిలి జనార్దన్ అర్జీని ఇస్తూ తమ గ్రామంలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి సుమారు 200 మంది వేతనదారులకు జనవరి మూడవ వారం నుంచి నేటివరకు వేతనాలు చెల్లించలేదని, వాటిని మంజూరు చేయాలని కోరారు.
- పార్వతీపురం మండలం డి.ములగ నుంచి చౌదరి రాణి వినతి పత్రాన్ని అందజేస్తూ, తాము పెయింటింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తమకు ఆధార్, రేషన్ కార్డులు లేనందున వాటిని మంజూరుచేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

చట్టపరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలి

పార్వతీపురం రూరల్: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి సకాలంలో చర్యలు తీసుకునేందుకు సంబంధిత అధికారులు చొరవ చూపాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. అలాగే చట్టపరిధిలో నాణ్యమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు శాఖ కార్యాలయానికి జిల్లాలో ఉన్న పలు పోలీసు స్టేషన్‌ల పరిధిలలో నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి చూసి ఫిర్యాదు దారులతో ముఖాముఖి మాట్లాడి క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదుల్లో ముఖ్యంగా కుటుంబ కలహాలు, భర్త, అత్తారింటి వేదింపులు, భూ ఆస్తి వివాదాలు, సైబర్ మోసాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీల వసూళ్లు, ప్రేమ పేరుతో మోసాలపై ఎస్పీ 12 ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ ఆదాం తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీఏ గ్రీవెన్స్‌సెల్‌కు 22 వినతులు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 22 వినతులు వచ్చాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వేయించాలని భామిని మండలం సన్నాయిగూడ రైతులు కోరారు. వరదగోడ మంజూరు చేయాలని టిటుకుపాయిగూడకు చెందిన ఆరిక శ్యామల రావు, మల్లి గ్రామానికి చెందిన బూగన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో జి.చిన్నబాబు, ఈఈ రమాదేవి, పీహెచ్‌వో ఎస్‌వీ గణేష్, ఏటీడబ్ల్యూవో మంగవేణి, ఇన్‌చార్జ్ డిప్యూటీఈవో చంద్రరావు, ఏఎంవో కోటిబాబు, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్, ఏపీడీ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో వైభవంగా పూర్ణాహుతి



యాగశాలలో పూర్ణాహుతి జరిపిస్తున్న అర్చకులు



రామ కోనేరు వద్ద చక్ర తీర్థ స్నానం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలు సోమవారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకస్వాములు చక్రతీర్థ స్నానం, పూర్ణాహుతి కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాల భోగం నిర్వహించిన తరువాత యాగశాలలో పూర్ణాహుతి హోమం జరిపించారు. అనంతరం శ్రీ సుదర్శన స్వామి పెరుమాళ్లను రామపుష్కరిణి వద్దకు పల్లకిలో ఊరేగింపుగా తీసుకువెళ్లి మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ స్వామికి చక్రస్నానం చేయించారు. తరువాత గ్రామ బలిహరణ, బాలభోగం జరిపించి యాగశాలలో సుందర కాండ హవనం నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణం చేపట్టి వేణుగోపాలుడి కల్యాణ మహోత్సవాలకు ముగింపు పలికారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, రామగోపాల్, భక్తులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర సమన్వయంతో దాడులు

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ బి.శ్రీనాథుడు



సారా తయారీ కేంద్రాలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో అక్రమ మద్యం తయారీ యూనిట్లపై అంతర్రాష్ట్ర సమన్వయంతో పెద్ద ఎత్తున దాడి నిర్వహించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ బి.శ్రీనాథుడు తెలిపారు. అక్రమ మద్యం తయారీకి వ్యతిరేకంగా నిరంతరం చర్యలు తీసుకుంటున్న ఎక్సైజ్ శాఖ, ఒడిశా ఎక్సైజ్ అధికారులతో కలిసి సోమవారం ఒడిశాలోని రాయగడ జిల్లా గుణుపూర్ బ్లాక్ కొత్తగూడ, కంగమానుగూడ, సరిహద్దు వెంబడి ఉన్న చీడివలస, కర్లి గ్రామాల అటవీ ప్రాంతాల్లోని అధిక సాంద్రత కలిగిన అక్రమ మద్యం తయారీ యూనిట్లపై పెద్ద ఎత్తున దాడి చేసినట్లు చెప్పారు. ఈ దాడిలో 23,000 లీటర్ల పులియబెట్టిన బెల్లం ఊటలను స్వాధీనం చేసుకుని అక్కడికక్కడే ధ్వంసం చేసినట్లు చెప్పారు. అలాగే 440 లీటర్ల ఐడీ మద్యాన్ని పట్టుకుని ధ్వంసం చేశామన్నారు. దీనికి సబంధించి ఇద్దరిపై రెండు కేసులు నమోదు చేశామని, పలువురు అనుమానితులను కూడా దాడిలో గుర్తించామని ప్రస్తుతం తదుపరి విచారణ కొనసాగుతోందని వివరించారు. ఆంధ్రప్రదేశ్-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో అక్రమ మద్యం తయారీ, స్మగ్లింగ్‌ను అరికట్టడానికి ఉద్దేశించిన విజయవంతమైన ఈ ఉమ్మడి ఆపరేషన్‌లో, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రెండు రాష్ట్రాల ఎక్సైజ్ శాఖల సమన్వయంతో దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పనుకువలసలో ఎంఎస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన రేపు

పార్వతీపురం/సీతంపేట: పాలకొండ నియోజకవర్గంలోని పనుకువలసవద్ద ఎంఎస్ఎంఈ పార్కుకు ఈనెల 14న ఉదయం 10 గంటలకు శంకుస్థాపన చేయనున్నట్లు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎం.మురళీమోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారిత వ్యవహారాల శాఖమంత్రి కొండపల్లి శ్రీనివాస్ శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు.

రెండు చూడి పశువుల దహనం

- వేపాడలో అగ్నిప్రమాదం
- మంటలు అదుపుచేసిన అగ్నిమాపక సిబ్బంది

వేపాడ: మండలకేంద్రం వేపాడలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో పశువుల పాక కాలిపోయి, రెండు చూడి ఆవులు సజీవ దహనం కావడంతో విషాదం నెలకొంది. ఇందుకు సంబంధించి స్థానికులు, బాధితులు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన నిరుజోగి కృష్ణ తన పశువుల శాలలో రెండు చూడి ఆవులను కట్టి ఇంటికి వచ్చేశాడు. అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో పశువుల పాక కాలిపోతోందన్న సమాచారం తెలుసుకుని స్థానికులు కళ్లాలకు పరుగులు తీశారు. ఎస్.కోట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. అయితే ఈ ప్రమాదంలో పశువుల పాక కాలిపోవడంతో పాటు పాకలో ఉన్న రెండు చూడి ఆవులు సజీవ దహనమయ్యాయి. సుమారు రూ.రెండు లక్షల ఆస్తినష్టం ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు. ఈ సమాచారం తెలుసుకున్న ఇన్‌చార్జి తహసీల్దార్ సన్యాసినాయుడు, వీఆర్‌ఓ కొండమ్మ తదితరులు గ్రామానికి వచ్చి పరిశీలించి నివేదికను కలెక్టర్‌కు పంపించారు.

నీరుపేద రైతుల ఆందోళన

- సాగునీటి కష్టాలు తీర్చండంటూ వేడుకోలు
- ఇబ్బందులు పడుతున్న ఐదుగ్రామాల రైతులు
- సమస్య పరిష్కరించాలని కలెక్టరేట్ ఆవరణలో నిరసన



కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలుపుతున్న రైతులు

పార్వతీపురంటౌన్: కొమరాడ మండలం కోటిపాం గ్రామ ప్రజలు వనకాబడి గెడ్డ ఆయకట్టు ద్వారా వచ్చే సాగు నీటి ద్వారా వ్యవసాయపనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. గెడ్డపై కొత్త చెక్ డ్యాం నిర్మాణం చేపట్టడంతో తమకు సాగు నీరు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం కలెక్టరేట్ వద్ద గ్రామస్తులు నిరసన తెలియజేశారు. అనంతరం కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కోటిపాం గ్రామంలో 500 కుటుంబాలున్నాయని వనకాబడి గెడ్డ ఆయకట్టు నుంచి వచ్చిన నీటి ద్వారా వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నామన్నారు. వనకాబడి గెడ్డ నుంచి వనకాబడి, బట్టిమాగవలస, చినఖేర్జల, లింగందొర వలస, బూర్జి వలస మీదుగా వచ్చి కోటిపాం కొత్తచెరువులో గెడ్డ నీరు కలుస్తుందని, చెరువు నిండిన తర్వాత ఈ చెరువు నుంచి సుమారు పది చెరువులు, బందలు నిండుతాయని, ఈ నీటి వనరుల మీదే తాము సాగుచేసుకుంటూ బతుకుతున్నామని తెలిపారు.

వెయ్యి ఎకరాలకు ఈ సాగు నీరే ఆధారం

వెయ్యి ఎకరాల సాగు ఈనీటి మీదే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నామన్నారు. వనకాబడి ఆయకట్టు నీరు ప్రధానంగా కోటిపాం గ్రామానికి వస్తుంది. కావున గత 28న వనకాబడి గెడ్డపై చెక్ డ్యామ్ నిర్మించేందుకు పరిశీలించారని, దీనికి సంబంధించిన చెక్ డ్యాం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న పాత నిర్మాణం అలాగే ఉంటే తమ గ్రామానికి రావాల్సిన ఆయకట్టు నీటికి ఇబ్బంది ఉండదన్నారు. కానీ కొత్తగా చెడ్‌డ్యామ్ నిర్మించడం వల్ల మా గ్రామానికి రావాల్సిన నీరు ఆగిపోతుంది. దీంతో చాలామంది రైతులు ఇబ్బందికి గురవుతారని తెలియజేస్తున్నారు. తమ గ్రామ రైతులకు వ్యవసాయానికి ఈ చెక్‌డ్యాం ద్వారా వచ్చే నీరు మాత్రమే ఆధారమని, పరిశీలించి ఎవరికీ ఇబ్బంది కలగకుండా చేసి తమకు సాగునీరు అందించాలని కోరుతున్నారు.

రైతులను ఆదుకోండి



ఎన్నోఏళ్లుగా వ్యవసాయాన్ని నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న రైతులను అధికారులు ఆదుకోవాలి. వనకాబడి ఆయకట్టు గెడ్డపై నిర్మించనున్న చెక్ డ్యాం పనులను ప్రారంభించరాదు. సుమారు వెయ్యి ఎకరాలకు పైబడి సాగునీరు అందిస్తున్న గెడ్డపై ప్రస్తుతం ఉన్న చెక్‌డ్యాంను యథావిధిగా ఉంచి రైతులకు సాగునీటిని అందజేయాలి.

– పాండ్రంకి రామకృష్ణ, రైతు, కోటిపాం

కొత్త చెడ్‌డ్యామ్ నిర్మాణం వద్దు



గ్రామంలో 500మంది కుటుంబాలకు సంబంధించిన సుమారు 1000 ఎకరాలకు వనకాబడి గెడ్డ ఆయకట్టు ద్వారా వచ్చే సాగు నీటి ద్వారా పంటలు పండుతున్నాయి. ప్రస్తుతం ఉన్న చెక్‌డ్యాం ప్రాంతంలో కొత్తగా మరో చెక్ డ్యాం నిర్మాణం చేపట్టనున్నారు. దీనివల్ల రైతులకు తీవ్రనష్టం చేకూరుతుంది. అధికారులు ఈ విషయంపై పునరాలోచించి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నాం.

– ఎజ్జు గుంపస్వామి, రైతు, కోటిపాం

500 కుటుంబాల జీవనాధారం పోతుంది



నూతన చెక్‌డ్యాం నిర్మాణం వల్ల గ్రామంలో గల 500మంది కుటుంబాలకు జీవనాధారం పోతుంది. ఐదు గ్రామాలకు సాగునీటి కష్టాలు ఏర్పడతాయి. ప్రభుత్వం, అధికారులు పునరాలోచించి చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టకుండా చూడాలి. ప్రస్తుతం ఉన్న చెక్‌డ్యాం ద్వారానే నీటిని సరఫరా చేయాలి.

– పప్పల సోమేశ్వరరావు, రైతు, కోటిపాం

ముగిసిన ఆహ్వాన నాటిక పోటీలు

- ఉత్తమ ప్రదర్శనగా చీకటి పువ్వు నాటిక
- ద్వితీయ, తృతీయ ప్రదర్శనలుగా కొత్త పరిమళం, రైతేరాజు



చీకటిపువ్వు నాటిక బృందానికి మెమెంటోతో పాటు నగదు బహుమతి అందజేస్తున్న కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు



ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన చీకటిపువ్వు నాటిక

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు మూడు రోజుల పాటు వైభవంగా జరిగి ఆదివారం ముగిశాయి. గరివిడి కల్చరల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో శ్రీరాం హైస్కూల్ ఆవరణంలో జరిగిన నాటిక పోటీల ప్రదర్శనలో..కరీంనగర్‌కు చెందిన చైతన్య కళాభారతి ఆధ్వర్యంలో ప్రదర్శించిన చీకటిపువ్వు నాటిక ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. అదేవిధంగా బొరివంకకు చెందిన శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శించిన కొత్త పరిమళం నాటిక ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా నిలవగా హైదారాబాద్‌కు చెందిన కళాంజలి ఆధ్వర్యంలో ప్రదర్శించిన రైతేరాజు నాటిక తృతీయ ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది.

నగదు బహుమతుల అందజేత..

ఈ నాటికల ప్రదర్శనలో ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన చీకటిపువ్వు బృందానికి రూ.15వేలు, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన కొత్త పరిమళం నాటిక బృందానికి రూ.12,500, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన నాటిక బృందానికి రూ.10వేలు నగదు బహుమతిని నిర్వాహకులు అందజేశారు. అలాగే ప్రతి నాటిక ప్రదర్శనకు రూ.25వేలు ప్రోత్సాహంగా అందజేశారు. అదే విధంగా కొత్త పరిమళం రచయిత కేకే.ఎల్ స్వామికి రూ.5వేలు, చీకటిపువ్వు నాటిక దర్శకుడు రమేష్ మంచాలకు రూ.5వేల నగదు బహుమతిని కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధుల చేతుల మీదుగా అందజేశారు.

సీతం కళాశాలలో 'ఇ-గేమ్' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి తదితరులు

విజయనగరం అర్బన్: సీతం కళాశాలలో 'ఈ-గేమ్ (ఎ డిఫరెంట్ అప్రోచ్ టు లెర్న్ ఇంగ్లీష్ విత్ ఫన్) అనే పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. పెహల్గాం ఉగ్రదాడిలో మరణించిన పౌరులు, వీరమరణం పొందిన సైనికులకు తొలుత ఘనంగా నివాళులర్పించి వారి ఆత్మ శాంతి కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎంపీ, సత్య సంస్థల కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ ఇ-గేమ్ (ఇంగ్లీష్ గ్రామర్ ఆక్సిస్ మేడ్ ఈజీ) పుస్తకం ద్వారా విద్యార్థులు సులభంగా, తర్కబద్ధంగా, సరదాగా ఇంగ్లీష్ గ్రామర్ నేర్చుకోగలుగుతారన్నారు. ఇందులో స్వప్టిప్స్ అనే 7 ప్రధాన అంశాల (వాక్యాలు, క్రియలు, ఆర్టికల్స్, స్పీచ్ భాగాలు, కాలాలు, ప్రశ్నార్థకాలు-ఆదేశాలు, పొజిషన్ మార్కులు)తో పాటు అడ్వాన్స్‌డ్ గ్రామర్, ప్రశ్నా బ్యాంకులు, రిడిల్స్, పాల్వ్స్ వంటి వర్డ్ గేమ్‌లు, ఎక్సలునీమ్, వెర్సనీమ్, ఫ్యాక్టనీమ్, స్లింగ్, ఐథెర్, స్పెల్ స్ప్రెడ్స్ వంటి వినూత్న అంశాలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరికి ఇంగ్లీష్ భాష అనివార్యమని, ఈ పుస్తకం ద్వారా అలవోకగా నేర్చుకోవచ్చని తెలిపారు.

మేన్ ఆఫ్ విజ్‌డం

సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ ఈ పుస్తకం విద్యార్థులలో ఇంగ్లీష్ భాషాపరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసి, ప్రపంచ స్థాయిలో పోటీతత్వం కలిగించగలదన్నారు. రచయిత ఆర్‌యూ నరసింహాన్ని 'మేన్ ఆఫ్ విజ్‌డం' అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూ-జీవీ రిజిస్ట్రార్ డాక్టర్ జయసుమ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రచయిత ఆర్‌యూ నరసింహం పుస్తక విశేషాలను వివరించి, గ్రామర్ నేర్చే పద్ధతిని సరదాగా మార్చేందుకు ఈ పుస్తకం సహాయపడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్. మజి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, విశాఖ సాంస్కృతిక పత్రిక ఎడిటర్-పబ్లిషర్ శ్రీ సిరెలా సన్యాసిరావు, ఇతర కళాశాలల ఇంగ్లీష్ అధ్యాపకులు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఎంపీడీఓకు ఫిర్యాదు

- పని కల్పించాలంటూ వేతనదారుల ధర్నా



ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నరవ గ్రామం వేతనదారులు

గంట్యాడ: జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో పనికి వెళ్లే వేతనదారులకు పనికల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ ఫీల్డ్ అసిస్టెంట్‌పై గ్రామసర్పంచ్, వేతనదారులు సోమవారం ఫిర్యాదు చేశారు. పెదవేమలి గ్రామంలో గత వారం 160 మంది వేతనదారులకు పనికల్పించకుండా ఫీల్డ్ అసిస్టెంట్ అలసత్వం వహించారని, ఈవారం కూడా 30 నుంచి 40 మందివరకు వేతనదారులకు పనిలేకుండాచేశారని పెదవేమలి గ్రామ సర్పంచ్ వర్రి పాపునాయుడు ఎంపీడీఓ ఆర్‌వీ రమణమూర్తికి ఫిర్యాదు చేశారు. దీనివల్ల వేతనదారులు నష్టపోతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పని కావాలని వేతనదారులు డిమాండ్ చేస్తున్నప్పటికీ వారికి పని కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో సదరు ఫీల్డ్ అసిస్టెంట్‌పై తగిన చర్యలు తీసుకుని వేతనదారులకు పనికల్పించాలని కోరారు.

పనికల్పించాలని ధర్నా

అలాగే మండలంలోని నరవ గ్రామానికి చెందిన వేతనదారులు సోమవారం ఎంపీడీఓకార్యాలయం ఎదుట తమకు పని కల్పించాలని ధర్నా నిర్వహించారు. ఉపాధి సిబ్బంది తీరు వల్ల తాము ఉపాధి కోల్పోయామని వాపోయారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌గా చలామణి అవుతున్న మహిళపై ఫిర్యాదు

నరవ గ్రామంలో డ్వామా శాఖ నుంచి ఎటువంటి అపాయింట్ మెంట్ ఆర్డర్ లేకుండా షాడో ఫీల్డ్ అసిస్టెంట్‌గా చలామణి అవుతున్న మహిళపై చర్యలు తీసుకోవాలని అదేగ్రామానికి చెందిన నరవ సన్యాసిరావు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై రెండు సార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని, పైగా సదరు మహిళకు ఉపాధి హామీ అధికారులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ఫీల్డ్ అసిస్టెంట్ మాదిరి మస్తర్లు పరిశీలించడం, పనులు పురమాయించడం చేస్తున్నారని ఆరోపించారు.

ఆత్మరక్షణ విద్యలో ప్రావీణ్యం సాధించాలి

- ఒలింపిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం
- ప్రారంభమైన మూడవ నేషనల్ తైక్వాండో సెమినార్



ఇరాన్ దేశానికి చెందిన ట్రైనీ అబ్బాస్ షేక్‌ను సత్కరిస్తున్న దృశ్యం

విజయనగరం: ఆత్మరక్షణ విద్య తైక్వాండోలో క్రీడాకారులు మరింత ప్రావీణ్యం సాధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని ఒలింపిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కె.పురుషోత్తం ఆకాంక్షించారు. ఈ మేరకు న్యూ ఆంధ్ర తైక్వాండో అసోసియేషన్ సారథ్యంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ నుంచి 15 వ తేదీ వరకు విజయనగరంలోని రాజీవ్ స్టేడియంలో తలపెట్టిన మూడవ నేషనల్ తైక్వాండో సెమినార్ సోమవారం ప్రారంభమైంది. ఈ సెమినార్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన 120 మంది క్రీడాకారులు పాల్గొనగా..క్రీడాకారులకు ఇరాన్ దేశానికి చెందిన అబ్బాస్ షేక్ నూతన మెలకువలను నేర్పించారు. నాలుగు రోజుల పాటు జరిగే శిక్షణను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని పురుషోత్తం సూచించారు. అంతర్జాతీయ యవనికపై తలపడే క్రీడాకారులకు ఈ సెమినార్ దోహదపడుతుందని పేర్కొన్నారు. సెమినార్‌లో నేర్చుకున్న అంశాలను నిరంతరం సాధన చేయడం ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం సెమినార్‌లో శిక్షణ ఇచ్చేందుకు వచ్చిన అబ్బాస్ షేక్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి కె.శ్రీహరి, జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు, కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.